# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 6, జులై 2026


## మహాకార్యానికి శ్రీకారం..

# బాసర ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్ హయాంలోనే బాసర అభివృద్ధి సాధ్యం
- గర్భగుడి, మండప నిర్మాణానికి రూ.31 కోట్ల విరాళం అందజేసిన దాతలు



**భైంసా, జులై 04, ప్రభాతవార్త:**

దేశంలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ మహాకార్యానికి శనివారం అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా భక్తులు ఎదురుచూస్తున్న ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్, ప్రధాన దాతలైన హైదరాబాద్‌కు చెందిన పద్మప్రియ సునంద్ దంపతులు కలసి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పనుల ప్రారంభం నేపథ్యంలో ఆలయ అధికారులు అమ్మవారి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసి ఏర్పాట్లు చేశారు. బాసర క్షేత్ర సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.354 కోట్ల ప్రభుత్వ నిధులను కేటాయించగా, ఆలయ గర్భగుడి, మండప నిర్మాణానికి దాతలు పద్మప్రియ సునంద్ దంపతులు రూ.31 కోట్ల భారీ విరాళాన్ని అందించారు. దీంతో దాదాపు రూ.400 కోట్లతో బాసర క్షేత్రం అద్భుత ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకోనుంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆలయ పునర్నిర్మాణం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఎమ్మెల్యే రామారావు పటేల్ చొరవతోనే సాధ్యమైందని ఈ సందర్భంగా భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ దాతలైన పద్మప్రియ సునంద్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి, వారి చేతుల మీదుగానే పనులను ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా తన హయాంలోనే ఈ మహా పుణ్యక్షేత్ర పునర్నిర్మాణం జరగడం పూర్వజన్మ సుకృతంగా, ఒక అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. అమ్మవారి క్షేత్ర నిర్మాణంలో భాగస్వామ్యం కావడం ఎంతో పుణ్యఫలమన్నారు. బాసర అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను శాసనసభ్యునిగా ఎన్నికైన నాటి నుండి బాసర ఆలయ అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి సారించానని, పలుమార్లు శాసనసభలోనూ ఈ విషయమై గళమెత్తానని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఈ మహాకార్యానికి అడుగులు పడటం వెనుక అమ్మవారి అనుగ్రహం ఉందన్నారు. ఆలయ పునర్నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఆర్థికంగా, పర్యాటకంగా మరింత ప్రగతి సాధిస్తుందని, సరస్వతి క్షేత్రం దేదీప్యమానంగా వెలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ అర్చకులను, అధికారులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు

- ★ అనుమతి లేకుండా హాస్టల్‌లో ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోండి
- ★ పోలీసులకు సూచించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**చెన్నూరు, జూలై 5, ప్రభాతవార్త**




కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక కొంతమంది పనిగట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి వివేక్ వెంకటస్వామి మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో శనివారం రోజు విద్యార్థులకు సరైన ఆహారం ఇస్తలేరని వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంత్రి వివేక్ హాస్టల్ ను సందర్శించారు. జరిగిన సంఘటనపై ఆరా తీసిన మంత్రి వివేక్ మీడియాతో మాట్లాడుతూ కొంతమంది పనిగట్టుకుని హాస్టల్ లోకి ప్రవేశించి విద్యార్థులతో బలవంతంగా తప్పుడు ఆరోపణలు చేయించారని మండిపడ్డారు. కారం పొడితో భోజనం చేశారంటూ వచ్చిన వార్తలు అవాస్తవమని, కొందరు బిఆర్ఎస్ నాయకులు కావల్సుకొని చేసిన పన్నాగమని చెప్పుకొచ్చారు. హాస్టల్‌లో పర్మిషన్ లేకుండా వెళ్లిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఘటనపై చెన్నూరు సీఐ పూర్తి వివరణతో క్రిమినల్ యాక్ట్ ప్రకారం చర్యలు చేపడతామని చెప్పారు.



# వానొచ్చింది... అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్య రక్షణ

- చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు అత్యంత జాగ్రత్త
- పరిశుభ్రతే తొలి టీకా, పోషకాహారమే అసలైన రక్షణ కవచం
- వ్యాధులపై ప్రత్యేక కథనం





**మంచిర్యాల, జూలై 5, ప్రభాతవార్త**

వర్షాకాలం ప్రకృతికి పచ్చని అందాలను తీసుకొస్తుంది. అయితే అదే సమయంలో వైరల్ జ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, విరేచనాలు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు వంటి కాలానుగుణ వ్యాధుల ముప్పును కూడా పెంచుతుంది. వర్షపు నీరు నిల్వ ఉండటం, పరిశుభ్రత లోపించడం, కలుషిత తాగునీరు, బహిరంగ ఆహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధులు వేగంగా వ్యాపించే ప్రమాదం ఉంది. వైద్యుల సూచనల మేరకు ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉంటే చాలా వరకు ఈ వ్యాధులను నివారించడం సాధ్యమవుతుంది.



2లో..



బిఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు

## బిఆర్ఎస్ నేతల అరెస్ట్

**తాండూర్, జూలై 5 ప్రభాతవార్త :**

తాండూర్ మండలం మాదారం టౌన్షిప్ చెందిన బిఆర్ఎస్ నాయకులను ఆదివారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్ హౌస్ కేటీఆర్ పర్యటనకు మండలానికి చెందిన బి నేతలు వెళ్లకుండా ముందస్తుగా అరెస్ట్ చేశారు. మాదారంలోని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడ సతీష్, నాయకుడు క్రాంతి కుమార్ ఇళ్లకు మాదారం పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు.




## బెల్లంపల్లిలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

**బెల్లంపల్లి, జూలై 05, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) హెల్ప్ డెస్క్ కార్యాలయాన్ని ఆదివారం రోజున ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని బెల్లంపల్లి నియోజకవర్గం ఎస్ఐఆర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.కె ఖాజాపాషా బెల్లంపల్లి పట్టణంలో గల బూడిదగడ్డబస్తి 32వ వార్డులో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ దావా స్వాతిరమేష్ బాబు, 32వ వార్డు కౌన్సిలర్ నీలి కృష్ణ, 10వ వార్డు కౌన్సిలర్ గాలి సుమలత శ్రీనివాస్, డిసిసి మంచిర్యాల జనరల్ సెక్రటరీ రొడ్డా శారద, ఎస్ఐఆర్ బూత్ ఇంచార్జ్ దేవసాని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణ ప్రజలకు ఎస్ఐఆర్ అప్లికేషన్ ఫారం నింపడంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, సందేహాలు ఉన్నా ఈ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు గద్దెల కుమార్ సహా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం, మంత్రి, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం

**తాండూర్, జూలై 5, ప్రభాతవార్త :**

మండలంలోని ఐబి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్ద బోయిన శంకర ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఫ్లెక్సీకి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం నిధులను దశల వారిగా విడుదల చేస్తూ రైతు ఖాతాలో జమ చేస్తున్నదన్నారు.రైతు సంక్షేమం, అభ్యున్నతి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. ప్రజా, రైతు సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొన్ని పార్టీల నాయకులు ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, ఐ ఎన్ డి సి బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు షేక్ మోమిన్, ప్రధాన కార్యదర్శి నవీన్, నాయకులు పాల్గొన్నారు.



# వానొచ్చింది... అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్య రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

### వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే వ్యాధులు..

వైరల్ జ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, విరేచనాలు - వాంతులు, జలుబు - దగ్గు, శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులు

### పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యానికి భరోసా..

ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పాత టైర్లు, కుండీలు, ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి. మురుగు కాలువలు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి రోజు ఇంటి పరిసరాలను శుభ్రం చేయడం ద్వారా దోమల పెరుగుదలను గణనీయంగా తగ్గించవచ్చు.

### దోమలు - ఈగలు... వ్యాధులకు వాహకాలు..

దోమతెరలు వాడండి. కిటికీలకు మెష్ వలలు అమర్చండి. పూర్తి చేతుల దుస్తులు ధరించండి. చెత్తను మూత ఉన్న డబ్బాల్లో వేయండి. నిల్వ నీటిని వెంటనే తొలగించండి.

**పోషకాహారమే రోగనిరోధక శక్తికి మూలం:** వర్షాకాలంలో తాజా, వేడి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి.

**తప్పనిసరిగా తీసుకోవాల్సినవి:** ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నిమ్మ, నారింజ, ఉసిరి, జామ, తాజా పండ్లు,

**స్వచ్ఛమైన నీరే ప్రాణాధారం:** మరిగించిన లేదా శుద్ధి చేసిన నీరే తాగాలి. నీటి పాత్రలకు మూతలు తప్పనిసరిగా పెట్టాలి. కలుషిత నీరు, బయట ఐస్, అపరిశుభ్రమైన పానీయాలకు దూరంగా ఉండాలి.

**చిన్నారులు - వృద్ధులు - గర్భిణీలకు ప్రత్యేక జాగ్రత్తలు:** వర్షంలో ఎక్కువసేపు తడవకూడదు. తడిసిన వెంటనే పొడి దుస్తులు ధరించాలి. జ్వరం, దగ్గు, విరేచనాలు, వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

### డాక్టర్ ఏమంటున్నారు?

వర్షాకాలంలో మందుల కంటే పరిశుభ్రత గొప్ప రక్షణ. సురక్షితమైన తాగునీరు, సమతుల్య పోషకాహారం, దోమల నియంత్రణ చర్యలు పాటిస్తే చాలా కాలానుగుణ వ్యాధులను నివారించవచ్చు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

**ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన ముఖ్యాంశాలు:** నిల్వ నీరే దోమల ప్రధాన పెంపక కేంద్రం. చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల అనేక అంటువ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. పోషకాహారం శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కలుషిత తాగునీరు వల్ల విరేచనాలు, టైఫాయిడ్ వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది.

**చేయాల్సినవి:** మరిగించిన నీరే తాగాలి. వేడి వేడి ఆహారమే తీసుకోవాలి. చేతులను సబ్బుతో తరచూ కడుక్కోవాలి. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండనీయకూడదు. దోమతెరలు ఉపయోగించాలి. పోషకాహారం తీసుకోవాలి. లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

**చేయకూడనివి:** బహిరంగంగా అమ్మే ఆహారం తినకండి. మురికిగా ఉన్న చేతులతో భోజనం చేయకండి. నిల్వ నీటిని అలాగే ఉంచకండి. జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకండి. వైద్యుల సలహా లేకుండా మందులు వాడకూడదు

**ప్రజలకు పిలుపు:** మన ఇంటి పరిశుభ్రత... మన కుటుంబ ఆరోగ్యానికి భరోసా. మన వీధి పరిశుభ్రత... మన సమాజ ఆరోగ్యానికి రక్షణ.

వానను ఆస్వాదిద్దాం... వ్యాధులను అడ్డుకుందాం... ఆరోగ్యంగా జీవిద్దాం.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరడమే ప్రభుత్వ లక్ష్యం

**ఆసిఫాబాద్, జులై 5, ప్రభాతవార్త :**

అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు సర్ ఫారాల పరిశీలన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో రహమత్ నగర్‌లో ఎస్ఐఆర్ దరఖాస్తుల ప్రక్రియ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు ప్రజలతో పాటు, పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఎస్ఐఆర్ ఫారాలను పూర్తి చేసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, దరఖాస్తుల ప్రక్రియ సజావుగా సాగేలా వైస్ చైర్మన్ స్వయంగా దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కోసం^సర్్ దరఖాస్తులను పూర్తి చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ దరఖాస్తుల ప్రక్రియ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల సౌకర్యార్థం కోసం మరో వారం రోజుల పాటు ఒక ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మానుష, నాయకులు షాహిద్ హుస్సేన్, మోహన్ గౌడ్, అజీమ్, అబ్దుల్ గఫ్ఫార్, వివిధ వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సర్ ఫారాలను నింపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్

## విశ్రాంత సింగరేణి ఉద్యోగులందరికీ సమాన ప్రమాద బీమా కల్పించాలి

**మంచిర్యాల, జులై 5,ప్రభాతవార్త**



సింగరేణి వ్యాప్తంగా ఒకే విధమైన సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో, ఒక ప్రభుత్వరంగ బ్యాంకులో ఖాతాలు కలిగిన విశ్రాంత ఉద్యోగులకు అమలవుతున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని, ఇతర బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన విశ్రాంత ఉద్యోగులకూ విస్తరించాలని తెలంగాణ సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది.మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసి, రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, సంబంధిత బ్యాంకుల యాజమాన్యాలు తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.సింగరేణి ప్రాంతంలో వేలాది మంది విశ్రాంత ఉద్యోగులు వివిధ బ్యాంకుల్లో తమ ఖాతాలను నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం ఒక ప్రభుత్వరంగ బ్యాంకు ఖాతాదారులకు అందుతున్న 30 నుంచి 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం ఇతర బ్యాంకుల ఖాతాదారులకు లేకపోవడం వల్ల అసమాన పరిస్థితులు నెలకొంటున్నాయని సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు.విశ్రాంత ఉద్యోగులు జీవితాంతం సింగరేణి అభివృద్ధికి సేవలందించారని, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో అన్ని బ్యాంకుల ఖాతాదారులకు సమానంగా ప్రమాద బీమా వర్తింపజేస్తే ప్రమాదవశాత్తు జరిగే మరణాల సమయంలో కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, సంబంధిత బ్యాంకుల యాజమాన్యాలు చొరవ తీసుకుని సమాన బీమా సౌకర్యాన్ని అమలు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా కోరింది. సమావేశంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు గంగయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, కార్యదర్శి పోతరాజుల చంద్రయ్యతో పాటు మునిశెట్టి ధర్మారావు, రాంబాబు, లచ్చన్న, రామన్న, చల్లా రాజిరెడ్డి, శంకర్ రావు, నారాయణ, గూడ శంకర్, శేషాంక్ రావు, బక్కయ్య, రాజేశ్వర్ రావు, భూమన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

## కార్మికులు పనుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

**సారంగాపూర్, జులై 05, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు వర్షాకాల రక్షణ కిట్లను సర్పంచ్ బల్గూరి అజయ్ అందజేశారు. వర్షంలోనూ పారిశుద్ధ్య పనులు చేస్తున్నప్పుడు కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సురక్షితంగా చెత్తను తొలగించడం కోసం రైన్ కోట్లు, గ్లౌజులు, గమ్ బూట్లు (షూలు)తో పాటు వివిధ రకాల అత్యవసర ఔషధాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో పారిశుద్ధ్య పనులు చేసేటప్పుడు కార్మికులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వీధుల్లో విద్యుత్ స్తంభాలు, వైర్ల దగ్గర పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, జీపీఓ ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి శివరత్నం, వార్డు సభ్యులు, +గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్




## ప్రశ్నిస్తే అరెస్టులా? ప్రజాస్వామ్యమా లేక నియంతృత్వమా?

### - బెల్లంపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు

**బెల్లంపల్లి, జూలై 05, ప్రభాతవార్త**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న ప్రతిపక్ష నాయకులపై పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టడం జిల్లాలో ఉద్రిక్తతలకు దారి తీసింది. ముఖ్యంగా కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నప్పటికీ, మోటార్లు ఆన్ చేయకపోవడంపై స్థానికులు, ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాళేశ్వరం పర్యటనను అడ్డుకునేందుకు బెల్లంపల్లి ప్రాంతానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం వివాదాస్పదమైంది. ఈ చర్యను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. నీటిని ఎత్తిపోసే సామర్థ్యం లేకపోయినా, ప్రశ్నించే వారిని అణచివేయడానికి అక్రమ అరెస్టులు చేస్తున్నారు అని వారు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని, ఆ హక్కును నిర్బంధాలతో అణచివేయడం తగదని పేర్కొన్నారు. అలాగే, ఈ ఘటనపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణలో ఉన్న లోపాలను దాచిపెట్టేందుకే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. నిర్బంధాలతో నిజాలను ఎప్పటికీ దాచలేమని, ప్రజల గొంతును ఎవరూ ఆపలేరని వారు హెచ్చరించారు.

**జన్నారం, జూలై 5, ప్రభాతవార్త**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన కాంగ్రెస్ ప్రభుత్వంలో వణుకు పుట్టిస్తోందని జన్నారం బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద పుష్కలంగా నీళ్లు ఉన్నప్పటికీ,పంపులు ఆన్ చేయకుండా రైతాంగాన్ని వంచిస్తున్న రేవంత్ సర్కారు..తన బండారం బయటపడుతుందనే భయంతో అడ్డదారులకు తెరలేపింది.కేటీఆర్ పర్యటనను ఎలాగైనా అడ్డుకోవాలనే కుట్రతో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులను రంగంలోకి దించి భయానక వాతావరణాన్ని సృష్టిస్తోందని అన్నారు. ఈ క్రమంలోనే జన్నారం మండల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు తెల్లవారుజామునే అక్రమంగా ముందస్తు అరెస్టులు చేశారు.అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సుతారి వినయ్ కుమార్,చెటుపల్లి సత్యం,జాడి గంగాధర్,నర్సా గౌడ్,ప్రేమ్ సాగర్,సాయి కిరణ్ తదితరులు ఉన్నారు.నాయకులను ఇళ్లనుంచి బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



#### హైవేలపై దిగ్బంధం.. రైతులపై ఆంక్షలు!

కేటీఆర్ పర్యటనకు వెళ్లకుండా అడ్డుకునేందుకు హైదరాబాద్‌వరంగల్ హైవేతో పాటు ప్రధాన రహదారులన్నింటినీ పోలీసులు ముళ్లకంచెలు,బారికేడ్లతో దిగ్బంధించారు.కేవలం రాజకీయ నాయకులను మాత్రమే కాకుండా,తమ పొలాలకు నీళ్లు రాక ఎండిపోతున్న పంటలను చూసి ఆవేదనతో కేటీఆర్‌కు విన్నవించుకోవడానికి వస్తున్న సామాన్య రైతులను,కార్యకర్తల వాహనాలను సైతం పోలీసులు అడుగడుగునా అడ్డుకుంటున్నారు.

#### నీళ్లు ఇవ్వడం చేతకాక.. నిలదీస్తే అరెస్టులా?

కాళేశ్వరంలో నీళ్లున్నా పంపులు నడపకుండా నాటకాలు ఆడుతున్న రేవంత్ రెడ్డి సర్కారుకు రైతుల శాపం తగలడం ఖాయం.అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్య గొంతుకను నొక్కలేరు.కేటీఆర్ పర్యటనతో ప్రభుత్వ చేతకానితనం ఎక్కడ బయటపడుతుందోననే భయంతోనే ఈ పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారు అని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి.

#### ప్రభుత్వానికి బీఆర్ఎస్ హెచ్చరిక...

అరెస్టులతో ఉద్యమాలను,ప్రజా క్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడాన్ని ఆపలేరని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.రైతుల పొట్టగొడుతూ,ప్రతిపక్షాల పర్యటనలను అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.అక్రమంగా అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని,లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు.



## విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**బెల్లంపల్లి, జూలై 05, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గంలోని 14వ వార్డు కన్నాలబస్తీలో నూతనంగా ప్రారంభమైన ఊరు పోచమ్మ ఆలయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు నిర్వహించిన విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న నాతరి స్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బండి లక్ష్మణ్, సాయి బస్తీ నాయకులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భైంసాలో అంగరంగ వైభవంగా బోనాల పండుగ

### అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించిన భక్తులు

**భైంసా, జులై 05, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలో బోనాల పండుగను ఆదివారం అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా మాదిగ కులస్తులు తమ కులదైవాలైన శ్రీ మైసమ్మ తల్లి, శ్రీ గల్లీ పోచమ్మ, శ్రీ మారెమ్మ తల్లి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు నిష్ఠతో తయారు చేసిన బోనాలను, నైవేద్యాలను అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కుల సంఘం పెద్దలు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తున్న బోనాల పండుగను ఈ ఏడాది కూడా ఎంతో ఘనంగా నిర్వహించామన్నారు. పట్టణ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి పల్లెలు సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాల వద్ద సాంప్రదాయ పద్ధతిలో జంతు బలులు ఇచ్చారు. అమ్మవారి కరుణాకటాక్షాలు, ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం అధ్యక్షుడు తోట రాము, ముఖ్య నాయకులు, సంఘం పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈ నెల 15న సింగరేణి మెడికల్ బోర్డు: గుర్తింపు సంఘం

**నస్పూర్, జూలై 5, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికుల వైద్య సంబంధిత పెండింగ్ కేసుల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీన సింగరేణి మెడికల్ బోర్డు నిర్వహించనున్నట్లు గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల వైద్య సంబంధిత కేసులను పరిష్కరించేందుకు యూనియన్ ప్రతినిధులు యాజమాన్యంతో పలు దశల్లో జరిపిన చర్చలు సానుకూల ఫలితాన్నిచ్చాయని తెలిపారు. దీంతో మెడికల్ బోర్డు నిర్వహణకు యాజమాన్యం అంగీకరించిందని వారు వెల్లడించారు. అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతూ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## బాసర బాల ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

**భైంసా, జులై 04, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా సుప్రసిద్ధ బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ పునర్నిర్మాణ పనుల నేపథ్యంలో, భక్తుల దర్శనాల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన బాల ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. శృంగేరి పీఠం వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి, మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత నుంచి నిత్యపూజలు, ఆర్జిత సేవలు అన్నింటినీ బాల ఆలయంలోనే నిర్వహిస్తామని ఆలయ ఈవో అంజనా దేవి తెలిపారు. ఈ కార్యక్రమాల నేపథ్యంలో గత మూడు రోజులుగా ఆలయానికి ప్రముఖుల తాకిడి పెరిగింది. ఎమ్మెల్యేలు ఆలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన గర్భగుడి, మండప పునర్నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన దాతలు సూరపనేని సునంద్, పద్మప్రియ దంపతులు రూ.31 కోట్ల భారీ విరాళాన్ని అందించారు. పూర్తిగా కృష్ణశిలలతో 9 నెలల వ్యవధిలోనే నూతన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని దాతలు వెల్లడించారు. ఋగ్వేదంలోని "వాగ్దేవి సూక్తం" లో స్తుతించబడిన పవిత్ర అక్షరాభ్యాస క్షేత్రమైన బాసరకు అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని శృంగేరి పీఠం పండితులు శ్రీ సీతారామ శర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ దాతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా నల్లపోచమ్మ బోనాలు

**జన్నారం, జూలై 5, ప్రభాతవార్త**

జన్నారం మండల కేంద్రంలో ఆదివారం నాడు గ్రామస్థులు నల్లపోచమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఈ బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తులు డప్పు చప్పుళ్ల మధ్య గ్రామ ప్రధాన వీధుల గుండా వీర్ల గుట్ట వద్ద గల నల్ల పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని, అందరూ సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర సంఘం నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మంచిర్యాల మార్కెట్ రహదారులు ఎప్పుడూ?

### ఏళ్లుగా సాగుతున్న విస్తరణ పనులు - దుమ్ము, బురద, గుంతలతో ప్రజలకు నిత్య ఇబ్బందులు

### పనులు వేగవంతం చేసి నిర్దేశిత గడువులోనే పూర్తి చేయాలని సర్వత్రా విజ్ఞప్తి

మంచిర్యాల, జూలై 5,ప్రభాతవార్త


నగర అభివృద్ధికి ప్రతీకగా నిలవాల్సిన మంచిర్యాల మార్కెట్ ప్రాంత రహదారుల విస్తరణ పనులు నెలలుగా కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి కోసం చేపట్టిన ఈ పనులను ప్రజలు స్వాగతించినా, పనుల జాప్యం కారణంగా ప్రతిరోజూ ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులు, స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ ప్రాంతం పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటి. ప్రతి రోజూ వేలాది మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రహదారి పనులు నత్తనడకన సాగుతుండటంతో దుమ్ము, దూళి, గుంతలు, ట్రాఫిక్ రద్దీ ప్రజలకు నిత్య సమస్యలుగా మారాయి. వర్షాకాలంలో బురదతో నడవడమే కష్టంగా మారుతుండగా, ఎండాకాలంలో ఎగిసిపడే దుమ్ము ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని స్థానికులు చెబుతున్నారు. రహదారి విస్తరణ పనులు సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటంతో మార్కెట్ ప్రాంతంలోని వ్యాపారులు కూడా తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. వినియోగదారులు దుకాణాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనడంతో వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని వారు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అత్యవసర సేవల వాహనాలు కూడా ఆలస్యంగా చేరుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణ ప్రజలందరిలో ఒకటే ప్రశ్న వినిపిస్తోంది... ఖగమార్కెట్ రహదారి పనులు ఎప్పుడు పూర్తవుతాయి? పూర్తి స్థాయిలో సౌకర్యాలు ప్రజలకు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?గగ అని. అభివృద్ధి పనులు ప్రారంభించడం ఎంత ముఖ్యమో, వాటిని నిర్దేశించిన గడువులో నాణ్యతతో పూర్తి చేయడం కూడా అంతే ముఖ్యమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పనుల పురోగతిపై ప్రజలకు ఎప్పటికప్పుడు స్పష్టమైన సమాచారం అందించడంతో పాటు, పూర్తి చేసే కాలపట్టికను ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణ అభివృద్ధికి ప్రతీకగా నిలవాల్సిన మంచిర్యాల మార్కెట్ రహదారులు త్వరలోనే పూర్తై, ప్రజలు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించే పరిస్థితులు నెలకొనాలని మంచిర్యాల వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## చించోలి బ్రిడ్జి వద్ద రోడ్డంతా బురదమయం

- వాహనదారుల అవస్థలు
- అడెల్లి పోచమ్మ భక్తులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు - ప్రయాణికుల ఆగ్రహం

సారంగాపూర్, జులై 05, ప్రభాతవార్త:

*మండలంలోని చించోలి మల్లన్న సమీపంలో గల చించోలి బ్రిడ్జ్ వద్ద రోడ్డు అర కిలోమీటరు మేర పూర్తిగా బురదమయంగా మారింది. ఈ రోడ్డు గుండా ఆదివారం భైంసా, లోకేశ్వరం, నర్సాపూర్, దిలావర్‌పూర్ తదితర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు అడెల్లి పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించడానికి, మొక్కులు తీర్చుకోవడానికి తరలివచ్చారు. అయితే రోడ్డు అంతా బురదగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బురదలో ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి పలువురు కిందపడిపోయారు. అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారు తప్ప రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదని, ప్రజల ప్రాణాలంటే అధికారులకు లెక్క లేకుండా పోయిందని వాహనదారులు, గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులలో జవాబుదారితనం లోపించిందని వారు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రయాణికులు, భక్తుల ఇబ్బందులను తొలగించాలని కోరారు.*






సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు

## ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

- మధ్యాహ్న భోజన పథకం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు డిమాండ్

భైంసా, జులై 04, ప్రభాతవార్త:

పాఠశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయులకు కూడా అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గంలో నిర్ణయించడం ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు అన్నారు. భైంసా పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేస్తూ తీసుకున్న నిర్ణయం ద్వారా వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు వచ్చే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు హాజరు శాతాన్ని పెంచడంపైనే ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఆ దిశగానే పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను మెరుగుపరచడానికి మధ్యాహ్న భోజన ఏజెన్సీల గౌరవ వేతనాన్ని పెంచాలని, వారికి రావాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. అలాగే విద్యార్థుల రోజువారీ మెస్ రేట్లను కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించే బాధ్యతలను ఇప్పటికే ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, కాబట్టి ప్రత్యేకంగా ఈ పథకాన్ని వారికి వర్తింపజేయాల్సిన అవసరం లేదన్నారు. దీనికంటే ఉపాధ్యాయులకు రావాల్సిన న్యాయమైన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో భైంసా మండల అధ్యక్షుడు ఎస్. గంగాధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సయ్యద్ అన్సర్, టీ. గంగామోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సలీం అహ్మద్ ఖాన్, మండల అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన పెరిక సంఘం నూతన కమిటీ సభ్యులు

## నస్పూర్ మండల పెరిక సంఘం అధ్యక్షుడిగా అంబడి కుమారస్వామి

### నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నస్పూర్, జూలై 5, ప్రభాతవార్త

నస్పూర్ మండల పెరిక సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అంబడి కుమారస్వామి, గౌరవ అధ్యక్షులుగా తిప్పని రామన్న, ప్రధాన కార్యదర్శిగా రెంక రవిలు ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా ఒడ్డె వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా అల్లం సతీష్, దొమ్మటి రాజేందర్, ప్రచార కార్యదర్శిగా దొమ్మటి కిరణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు అంబడి కుమారస్వామి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన సంఘం పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుంటూ పెరిక సంఘం బలోపేతానికి, సామాజిక అభివృద్ధికి తన వంతుగా నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సంఘ సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో పెరిక సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు బొడ్డు శంకర్, నాయకులు కార్యూరి చంద్రమోళి, చుంచు రాజ్‌కిరణ్, అత్తి సరోజతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డుపై యాజమాన్యం అధికారిక ప్రకటన చేయాలి: హెచ్‌ఎంఎస్

నస్పూర్, జూలై 5, ప్రభాతవార్త

సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణపై యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికులకు అధికారిక ప్రకటన చేయాలని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, అధ్యక్షులు తిప్పారపు సారయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత 15 నెలలుగా బోర్డు నిర్వహించకపోవడంతో సుమారు 2000 మంది కార్మికులు తమ వారసులకు ఉద్యోగాలు ఇప్పించుకోలేక మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొన్ని సంఘాలు యాజమాన్యంలా తేదీలను ప్రకటించడాన్ని వారు ఖండించారు. జూలై 20 లోపు పాత పద్ధతిలో మెడికల్ బోర్డు పునరుద్ధరిస్తున్నట్లు యాజమాన్యం అధికారికంగా ప్రకటించకుంటే, హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిరాహార దీక్ష చేపట్టడం ఖాయమని వారు స్పష్టం చేశారు.

## పత్తి సాగుకు ఊతం.. రైతులకు విత్తనాల పంపిణీ

వేమనపల్లి, జులై 5, ప్రభాతవార్త

మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ పథకంలో భాగంగా వేమనపల్లి మండలం నీల్వాయి రైతు వేదికలో అర్హులైన రైతులకు ఒక్క రూపాయికే పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆర్. సంతోష్ కుమార్, నీల్వాయి సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు రైతులకు విత్తన ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాలను వినియోగించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరన్న, ఏఈఓలు మాళవిక, నిముష, మండల సర్పంచులు వుప్పులపు సాయికృష్ణ, ముల్కల్ల శ్రీలత-సత్యనారాయణ, కొట్రంగి శ్రీనివాస్, మడే శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమం



రియాజ్, ఇతర కార్యవర్గ సభ్యులను శాలువాతో సత్కరిస్తున్న సర్పంచ్ పరచ సాయన్న

## బజార్‌హత్నూర్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**బజార్‌హత్నూర్, జులై 05, ప్రభాతవార్త:**

మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడిగా కొల్హారి గ్రామ ఉపసర్పంచ్ రియాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఉపసర్పంచుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా వర్తమన్నూర్ ఉపసర్పంచ్ దేవర్ల శ్రీకాంత్, కార్యదర్శిగా కాండ్లి ఉపసర్పంచ్ ఒడ్డెపెల్లి గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా గిర్నూర్ ఉపసర్పంచ్ గొల్లెన రాజేందర్, కోశాధికారిగా పిప్రి ఉపసర్పంచ్ బొంగురాల విశాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి, ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం శ్రమించాలని ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బజార్‌హత్నూర్ గ్రామ సర్పంచ్ పరచ సాయన్న, ఇచ్చోడ మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు బద్దం రాంచందర్, మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం: మండల నాయకులు

**సారంగాపూర్, జులై 05, ప్రభాతవార్త:**

లక్ష్మణచందా మండల కేంద్రంలో నిర్వహించిన 16వ లక్ష్మణచందా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో జీడీసీ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల) జట్టు విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జీడీసీ జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ద్వితీయ విజేతగా (రన్నరప్) వడ్యాల్ క్రికెట్ జట్టు నిలిచింది. పోటీలు ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవంలో మండలంలోని ప్రముఖ నాయకులు, నిర్వాహకులు పాల్గొని గెలుపొందిన జట్లకు ట్రోఫీలను అందజేశారు. ప్రథమ బహుమతి సాధించిన జీడీసీ క్రికెట్ జట్టు క్రీడాకారులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రన్నరప్‌గా నిలిచిన వడ్యాల్ క్రీడాకారులను కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. క్రీడలు యువతలో శారీరక, మానసిక ఉల్లాసాన్ని నింపడంతో పాటు దృఢ సంకల్పాన్ని, మంచి ఆరోగ్యాన్ని కలిగిస్తాయని చెప్పారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో తోడ్పడతాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకుంటూ క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా నిర్వాహకులు, వివిధ గ్రామాల యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆగస్టు 2న ఏఐటీయూసీ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

**- ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపు**

**బెల్లంపల్లి, జూలై 05, ప్రభాతవార్త**




ఆగస్టు 2న నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. బెల్లంపల్లిలోని సీపీఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్న దేశంలోని తొలి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని తెలిపారు. బ్రిటిష్ పాలన కాలంలోనే కార్మికులను ఐక్యపరిచి 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కనీస వేతన చట్టం, సంఘం ఏర్పరచుకునే హక్కు, సమ్మె చేసే హక్కు వంటి అంశాలు ఏఐటీయూసీ పోరాటాల ఫలితమని తెలిపారు. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ విధానాల పేరుతో కార్మికులను దోపిడీ చేస్తున్నారని, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టాలు తీసుకురావడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడి, ఏఎన్ఎమ్, ఆశా, ఆర్టీసీ, మధ్యాహ్న భోజన సిబ్బంది, 104, 108 సిబ్బంది, ఆసుపత్రి కార్మికులు, హమాలీలు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, లారీ డ్రైవర్లు, పెయింటింగ్, సెంట్రింగ్, టైల్, మార్బుల్ తదితర రంగాల కార్మికులు తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, శాంతిగని బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, మైన్ ఫిట్ కార్యదర్శి రత్నం ప్రవీణ్, దాడి రమేష్, నాయకులు రత్నం రాజం, కొంకుల రాజేష్, జాడి పోచం, సాకే శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జగదాంబ దేవి ఆలయ మండపాన్ని ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే

**- రూ.50 కోట్లతో చిన్నబుగ్గరాం లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శ్రీకారం చుట్టనున్నాం**

**- యువత మత్తు పానీయాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**నేరడిగొండ, జూలై 05, ప్రభాతవార్త:**



మండలంలోని చిన్నబుగ్గరాం గ్రామంలో నూతనంగా రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీ జగదాంబ దేవి ఆలయ మండపాన్ని బోథ్ శాసనసభ్యుడు అనిల్ జాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. చిన్నబుగ్గరాం గ్రామం ఎంతో చైతన్యవంతమైనదని ఎమ్మెల్యే కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ.. రూ.50 కోట్లతో చిన్నబుగ్గరాం లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. నేటి యువత చదువుతో పాటు ఆధ్యాత్మికత వైపు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. మత్తు పానీయాలు, ఇతర చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, బాధ్యతాయుతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉజ్వల చంపత్, మండల ప్రముఖ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనకు వేగం.. ఇంటింటికీ చేరుతున్న సర్వే

**- 139వ పోలింగ్ కేంద్ర పరిధిలో ప్రత్యేక పరిశీలన - రెండు చోట్ల నమోదైన ఓట్లపై సమగ్ర ధృవీకరణ**

**- 1,387 మంది ఓటర్ల వివరాల సవరణకు క్షేత్రస్థాయిలో చర్యలు**

**మంచిర్యాల, జూలై 5, ప్రభాతవార్త**



మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని 139వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారి అస్మా ఫర్వీన్ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ నమోదు పత్రాలను నింపుతున్నారు. ఈ పోలింగ్ కేంద్ర పరిధిలో మొత్తం 1,387 మంది ఓటర్లు ఉండగా, వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన సవరణలు చేపడుతున్నారు. ముఖ్యంగా రెండు చోట్ల పేర్లు నమోదైన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా గుర్తించి సమగ్రంగా ధృవీకరిస్తున్నారు. అలాగే చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్లు, కొత్తగా అర్హత పొందిన ఓటర్ల వివరాలు, ఇతర సవరణలపై కూడా పరిశీలన కొనసాగుతోంది. ప్రతి కుటుంబాన్ని స్వయంగా కలుసుకుని ఓటర్ల వివరాలను నమోదు పత్రాల్లో పొందుపరుస్తూ, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అధికారులు ప్రజలు తమ వివరాలను సక్రమంగా అందించి సర్వేకు సహకరించాలని, ఏవైనా తప్పులు లేదా మార్పులు గమనించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమని, అందుకే ప్రతి వివరాన్ని నిశితంగా పరిశీలిస్తూ సవరణ ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు.